కాలేజీల్లో బదిలీల సందడి

- 80 శాతం వరకు ట్రాన్స్‌ఫర్‌కు చాన్స్
- ప్రాధాన్యతకు, పాయింట్ల విధానంలో తేడాలు
- రెగ్యులర్ ఉద్యోగులకు దక్కని అవకాశం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూలై 21: ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నికల్ కాలేజీల్లో బదిలీల సందడి నెలకొన్నది. సుదీర్ఘ కాలం తర్వాత బోధన, బోధనేతర సిబ్బంది ట్రాన్స్‌ఫర్స్‌కు ప్రభుత్వం అవకాశమివ్వగా ఈ ప్రక్రియ ఆన్‌లైన్‌లో కొనసాగుతున్నది. విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్లు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పరిధిలోని సంస్థల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు బదిలీలు వర్తిస్తాయి. 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం కొత్త జిల్లా, జోన్, మల్టీజోన్ పరిధిలో ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ఆధారంగా బదిలీలు చేస్తున్నారు. ట్రైనీ ఎన్‌సీసీ అధికారులు, ఏఎన్‌వో కోసం ఎన్‌సీసీ యూనిట్లు ఉన్న చోట ఫిజికల్ కౌన్సెలింగ్ చేపడతారు. జూలై 16 నుంచి 31 వరకు బదిలీల ప్రక్రియ కొనసాగుతున్నది. ఉన్నత విద్యామండలి, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్లు, డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ మార్గదర్శకాల ప్రకారం, జూన్ 30 వరకు ఐదేళ్లు పూర్తి చేసిన వారిని బదిలీ చేస్తారు. అలాగే, జూన్ 30 వరకు రెండేళ్లు నిండిన వారు బదిలీలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే, 2026 జూన్ 30 లోపు సర్వీసు నుంచి విరమణ పొందనున్న వారు నిర్దిష్ట అభ్యర్థన చేస్తే గానీ బదిలీకి అవకాశం ఉండదు. ఈ ఏడాది జూన్ 30 నాటికి గరిష్టంగా ఐదేండ్లు, కనిష్టంగా రెండేండ్లుగా కొనసాగుతున్న వారిని ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 శాతం మంది అధ్యాపకులు బదిలీ కావాల్సి ఉన్నా అలా జరగడం లేదని, పలువురు జీవో 42ను సాకుగా చూపుతూ పాత స్థానంలోనే ఉండేందుకు యత్నిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

మార్గదర్శకాలకు భిన్నంగా ప్రక్రియ..

సర్కారు మార్గదర్శకాలకు భిన్నంగా బదిలీ ప్రక్రియ జరుగుతోందని పలువురు అధ్యాపకులు వాపోతున్నారు. ప్రాధాన్యత కోసం తెచ్చిన పాయింట్ల విధానంలో తేడాలు వస్తున్నట్లు తెలుస్తున్నది. లోకల్ టూ నాన్‌లోకల్, నాన్ లోకల్ టూ నోకల్ నిబంధనను పెట్టడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, సాధారణ బదిలీల మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో జీవో 42 ద్వారా మల్టీజోన్ 1, మల్టీజోన్ 2 అధ్యాపకుల స్థానాల్లో ఖాళీలు చూపడంలో స్పష్టత కొరవడిందని వాపోయారు. ఇందులో అటానమస్ కాలేజీల కోసం జారీ చేసిన జీవో 42ను సాకుగా చూపి పలువురు బదిలీలు తమకు కాదని, ఈ జీవో ఇచ్చిన నాటి నుంచి ఐదేండ్లు పూర్తయితేనే అర్హత అని చెబుతుండడంతో చాలా మంది అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సర్కారు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

రెగ్యులరైన లెక్చరర్లకు నో చాన్స్..

రాష్ట్ర వ్యాప్తంగా 11 ఏండ్లుగా జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసి రెగ్యులరైన 3,750 మంది అధ్యాపకులకు ప్రస్తుత బదిలీల్లో తీరని అన్యాయం జరుగుతున్నది. వారంతా 11 ఏండ్లుగా ఒకే చోట పని చేస్తుండగా, ఉమ్మడి జిల్లాలో మొత్తం 490 మంది ఉండగా, ఇందులో 440 మందికి బదిలీల్లో అవకాశం కల్పించడంలేదు. 2013లో ఐదేండ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను బదిలీ చేసిన ఉన్నత విద్యాశాఖ.. రెగ్యులర్ అయ్యాక బదిలీ చేయకపోవడం ఏంటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ 711 ఆధ్వర్యంలో పలుమార్లు ఉన్నత విద్యాధికారులకు విన్నవించగా, బదిలీలపై నిషేధం ఎత్తేస్తూ ప్రభుత్వం జీవో 80 జారీ చేసింది. దీని ప్రకారం కనీసం రెండేండ్ల సర్వీసు నిబంధన అమలు చేయాలి. ఈ జీవోలో స్పౌజ్, మెడికల్ కేటగిరీ ఉద్యోగులకు రెండేండ్ల నిబంధన వర్తించదని పేర్కొంటుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

నగరవాసులకు నల్లా కష్టాలు

- కొత్త కనెక్షన్ల కోసం బల్దియా చుట్టూ చక్కర్లు
- దరఖాస్తులు ఇచ్చి నెలలు దాటినా పట్టించుకోని వైనం
- లంచమిస్తే మాత్రం ఒక్కరోజులోనే..
- ఇంజినీరింగ్ అధికారులతీరుపై భగ్గుమంటున్న ప్రజలు

కొత్త నల్లాకనెక్షన్ల కోసం నగరవాసులు అష్టకష్టాలు పడుతున్నారు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా మంజూరుకాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం బల్దియా ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. సరైన పత్రాలు లేవంటూ సాకులు చెబుతూ చుక్కలు చూపుతున్నారని మండిపడుతున్నారు. అయితే, లంచమిస్తే మాత్రం ఒక్కరోజులోనే కనెక్షన్ ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు.

కరీంనగర్ కార్పొరేషన్, జూలై 21 : సాధారణంగా నల్లా కనెక్షన్ కోసం ఇంటినంబర్, ఆర్జీదారుడి ఆధార్‌కార్డు, ఆస్తిపన్ను చెల్లింపు పత్రంతో దరఖాస్తు చేసుకోవాలి. ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించిన తర్వాత ఆయా ఏరియాలకు సబంధించిన ఫిట్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిస్తారు. సక్రమంగా ఉంటే వెంటనే ఏఈ, డీఈలు అనుమతులు మంజూరు చేస్తారు. కానీ, కరీంనగర్ బల్దియా ఇంజినీరింగ్ అధికారులు మాత్రం ఎక్కడాలేని నిబంధనలు పెట్టి దరఖాస్తులను పెండింగ్‌లో పెడుతున్నారు. సీతారాంపూర్‌కు చెందిన ఓ దరఖాస్తుదారుడు గత జూన్ 21న కార్పొరేషన్ ఇంజినీరింగ్ ఆఫీసుకు కొత్త నల్లా కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, అప్లయ్ చేసి నెల రోజులు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆయన ప్రతిరోజూ ఆఫీసుచుట్టూ తిరుగుతున్నా కనికరించడం లేదు. ఇలా వందలాది మంది నల్లా కనెక్షన్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దొడ్డిదారిన దర్జాగా..

మరోవైపు దొడ్డిదారిన వచ్చిన దరఖాస్తులకు మాత్రం అధికారులు దర్జాగా నల్లా కనెక్షన్లు ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన కొందరు ఫిట్టర్లు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రంధ్రాలు తవ్వే కార్మికుల సూచనల మేరకు ఏరియాలను బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేలదాకా తీసుకుంటూ నల్లా కనెక్షన్లు ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు ఫిట్టర్లయితే ఖాళీ స్థలాల్లోనూ నల్లాకు పర్మిషన్ ఇస్తున్నట్లు తెలుస్తున్నది.

నెల రోజులుగా తిరుగుతున్న..

నేను నెల క్రితం నల్లా కనెక్షన్ కోసం మేయర్ సంతకంతో కార్పొరేషన్ ఆఫీసులో దరఖాస్తు చేసిన. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్న. సిబ్బంది మాత్రం అధికారుల సంతకం కాలేదంటూ ఇబ్బంది పెడుతున్నరు. అధికారులను కలిస్తే రెండురోజుల్లో అయిపోతుందంటూ తప్పించుకుంటున్నరు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకోని నల్లా కనెక్షన్ ఇప్పించాలి.

- జాన్సన్, నల్లా కనెక్షన్ దరఖాస్తుదారుడు

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

మద్యం డబ్బుల కోసం దోపిడీ

- టెక్నాలజీ సాయంతో ఛేదించిన పోలీసులు
- ఇద్దరి నిందితుల అరెస్ట్, సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, జూలై 21: ఇద్దరు స్నేహితులు కలిసి దావత్ చేసుకున్నారు. చెట్ల పొదల్లో కూర్చొని మద్యం తాగారు. అయితే మద్యం సరిపోకపోవడం, తెచ్చుకున్న డబ్బులు అయిపోవడంతో అటుగా వెళ్తున్న వ్యక్తిపై దాడి చేసి బంగారు గొలుసు, వెండి బ్రాస్‌లెట్, నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. ఈ నెల9న కొండగట్టులో జరిగిన దోపిడీ కేసును పోలీసులు టెక్నాలజీ సాయంతో చాకచక్యంగా ఛేదించారు. ఆదివారం మల్యాల ఠాణాలో డీఎస్పీ రఘుచందర్ నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. మల్యాల మండలం రాజారాం గ్రామానికి చెందిన విష్ణువర్ధన్, మల్యాలకు చెందిన గుర్రం వెంకటేశ్ ఇద్దరు స్నేహితులు, కొన్నేండ్ల క్రితం విదేశాలకు వెళ్లిన విష్ణువర్ధన్ ఇటీవలే ఇంటికి వచ్చాడు. విష్ణువర్ధన్, గుర్రం వెంకటేశ్‌కు దావత్ ఇచ్చేందుకు కొండగట్టుకు తీసుకెళ్లాడు. బల్వంతాపూర్ వెళ్లే మార్గంలోని క్యారీ సమీపంలో చెట్ల పొదల్లో బీర్లు తాగారు. అయితే, మద్యం సరిపోకపోవడం, డబ్బులు అయిపోవడంతో అక్కడే కొద్దిసేపు నీరిక్షించారు. ఈ సమయంలో జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన బండ స్వామి అటువైపు బహిర్భూమి కోసం వెళ్తున్నాడు. గమనించిన విష్ణువర్ధన్, వెంకటేశ్ ఆయన్ను అడ్డగించి దాడి చేశారు. అతడి వద్ద గల బంగారు గొలుసు, వెండి బ్రాస్‌లెట్, రూ. 3500 నగదు, ఐఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. బండ స్వామి ఫిర్యాదుతో మల్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ నీలం రవి, ఎస్ఐ నరేశ్‌కుమార్ నిందితుల ఆనవాళ్ల ఆధారంగా ఊహ చిత్రాలను రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ క్రమంలో ఊహ చిత్రాల ఆధారంగా వెంకటేశం, విష్ణువర్ధన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా, కేసు ఛేదనలో కీలకభూమిక పోషించిన సీఐ రవి, ఎస్ఐ నరేశ్‌కుమార్, పీసీలు రాజేందర్, సంతోష్‌కు ఎస్పీ అశోక్‌కుమార్ రివార్డులు అందజేయనున్నారు.

కిరణ్‌ను కాపాడరూ..!

- ఇటీవల రోడ్డు ప్రమాదంలో మొగిలిపాలెం యువకుడి తలకు గాయాలు
- కోమాలోకి.. దవాఖానలో చికిత్స
- ఆపన్న హస్తం కోసం కుటుంబ సభ్యుల ఎదురుచూపులు

సాయికిరణ్

తిమ్మాపూర్, జూలై 21: వారిది రెక్కాడితేగానీ డొక్కాడని పేద కుటుంబం. ఇంటిల్లిపాది రోజూ పనిచేస్తేనే పూటగడుస్తుంది. కానీ వారికి పెద్ద కష్టం వచ్చిపడింది. ఎదిగొచ్చిన కొడుకు రోడ్డుప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లి మృత్యువుతో పోరాడుతున్నాడు. దవాఖానలో చికిత్సకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కాగా, ఆపన్న హస్తం కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మొగిలిపాలెం గ్రామానికి చెందిన సముద్రాల ఆనందంది పేద కుటుంబం. ఇతని కొడుకు సాయికిరణ్ కరీంనగర్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 9న ఇంటికి వెళ్తుండగా, నుస్తులాపూర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్న కిరణ్ మెదడు నరాలు చిట్లిపోయి కోమాలోకి పోయాడు. వైద్యులు రూ.10లక్షల నుంచి రూ.15లక్షలు అవసరం పడుతాయని చెప్పడంతో అసలే అంతంత మాత్రంగా ఉన్న కుటుంబసభ్యులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. చికిత్స కోసం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఇనుకొండ జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీ పాశం తిలక్‌ప్రియ అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు వసంతరావు కొంతమేర సాయం చేశారు. అయినా ఇంకా పెద్ద మొత్తంలో అవసరమయ్యే అవకాశం ఉండగా, దాతలు ఆదుకోవాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు. కిరణ్ తండ్రి సముద్రాల ఆనందం ఫోన్ పే 9652803209, కిరణ్ గూగుల్ పే 9014473597 నంబర్లకు సాయం చేయాలని కోరుతున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

కొత్తపల్లి, జూలై 21 : అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా స్థానిక భగత్‌నగర్‌లోని ఫండస్ స్కూల్‌లో శనివారం నుంచి ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఓపెన్ చదరంగ పోటీలు ఆదివారం ముగిశాయి. విశ్వనాథ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పలు జిల్లాల నుంచి సుమారు 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల ముగింపు కార్యక్రమంలో ఫండస్ స్కూల్ డైరెక్టర్ సుశాంక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగ క్రీడ వైవిధ్యమైనదని, విద్యార్థి దశ నుంచే నేర్చుకుంటే ఉత్తమంగా రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు ప్రభాకర్ రెడ్డి, పద్మజారెడ్డి, చెస్ కోచ్ కొప్పర్తి శివయ్య, శంకర్, సీహెచ్ మారుతి పాల్గొన్నారు.

ఆటుపోట్లకు ఆస్కారం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారం సైతం నూతన రికార్డులు నమోదయ్యాయి. అయితే వరుస లాభాలతో సూచీలు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతున్న వేళ.. మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో ఓవరాల్‌గా స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 85.31 పాయింట్లు పెరిగి 80,604.65 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 28.75 పాయింట్లు అందుకుని 24,530.90 దగ్గర ముగిసింది. శుక్రవారం భారీ నష్టాలు వాటిల్లకపోతే సూచీలు నయా ఆల్‌టైమ్ హైల్లోనే ఉండేవి. ఇక ఈ వారం కూడా మదుపరులు ఆయా సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా తమ పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే వీలున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) కోసం కంపెనీలు తమ ఫైనాన్షియల్ రిజల్ట్స్‌ను ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ సూచీలు రికార్డుస్థాయి గరిష్ఠాల్లో ఉన్నందున పెట్టుబడులు-ఉపసంహరణల మధ్య ఇన్వెస్టర్లు కొట్టుమిట్టాడేందుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



ఆఖర్లో కాదు..

రుణ చెల్లింపుల్లో లాభం ఇలా

మనలో ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు బ్యాంకుల్లో లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో రుణాన్ని తీసుకోవడం సహజం. అయితే ఆ రుణ భారాన్ని వీలైనంత త్వరగా తీర్చేసుకుందామనుకొని కొన్ని పొరపాట్లు చేస్తూంటారు. దీనివల్ల నష్టాల పాలవుతూంటారు. అందుకే రుణ చెల్లింపుల విషయంలో ఎప్పుడు? ఎలా? అన్నది అత్యంత ముఖ్యమైన అంశం. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో లోన్లు తీసుకున్నప్పుడు.. వడ్డీతో కలిపి ఆ మొత్తాన్ని నిర్ణీత లేదా రుణగ్రహీత ఎంచుకున్న కాలవ్యవధికి సమాన ఈఎంఐలుగా పంచుతారు. అయితే ఈ నెలవారీ వాయిదాల్లో మొదట చెల్లిస్తూపోయే వాటిలో ఎక్కువ మొత్తం రుణంపై రుణదాతలు వసూలు చేసే వడ్డీనే ఉంటుంది. కాలం గడుస్తున్న కొద్దీ చివర్లో ఉండే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలే ఉంటుంది. అంటే.. రుణం తీసుకున్న తొలినాళ్లలో చెల్లించే ఈఎంఐల్లో ఎక్కువ మొత్తం వడ్డీ కిందనే పోతుంది. అసలు రుణంలో మైనస్ అయ్యేది చాలా తక్కువ. అలాగే ఆఖర్లో చెల్లించే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలు రుణమే ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రుణ భారం తగ్గించుకోవాలనుకునే వారు మొదట్లోనే వీలైనంత చెల్లించడం మంచిది. ఆఖర్లో ఒకేసారి చెల్లించడం కన్నా ఈఎంఐలను అనుసరించడమే లాభదాయకం.

లోన్ పోర్టబులిటీ

రుణాలపై వివిధ బ్యాంకులు, సంస్థలు రకరకాల వడ్డీరేట్లను అనుసరిస్తూంటాయి. రుణగ్రహీత సిబిల్ స్కోర్‌తోపాటు మరికొన్ని అంశాలు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే మనం తీసుకున్న రుణంపై వడ్డీరేటు ఎక్కువగా ఉందనుకుంటే.. ఎందులో తక్కువగా ఉందో తెలుసుకుని ఆ మొత్తం రుణాన్ని అక్కడికి మార్చుకోవడం ఉత్తమం. దీన్నే లోన్ పోర్టబులిటీ అంటారు. దీనివల్ల వడ్డీ భారం తగ్గుతుంది. కానీ ఈ ప్రక్రియకు కొన్ని చార్జీలు వర్తిస్తాయి. వీటన్నిటినీ కలిపి లెక్కించే రుణాన్ని ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మార్చుకోవడం లాభమా? నష్టమా? అన్నది తేల్చుకోవాలి. లేకపోతే భారం మరింత పెరిగే ప్రమాదం ఉన్నది.



ఐటీఆర్‌లో సెక్షన్‌తో కొడదాం



ఇది ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల కాలం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి (2024-25 మదింపు సంవత్సరం) గాను ఈ నెలాఖర్లోగా (జూలై 31) ఐటీఆర్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. దీంతో పన్ను ఆదా కోసం ఉన్న మార్గాలను అంతా వెతుకుతున్నారు. అయితే అందరికీ తెలిసింది సెక్షన్ 80సీ మాత్రమే. కానీ ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద రకరకాల పెట్టుబడులు, ఖర్చులు, రుణాల చెల్లింపులు, వడ్డీ ఆదాయాలపై పన్ను మినహాయింపును పొందవచ్చు. వాటిని పరిశీలిస్తే..

1. నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలదాకా పన్నును ఆదా చేసుకోవచ్చు. ఇక సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద అదనంగా మరో రూ.50,000 ఆదా చేయవచ్చు. మొత్తంగా రూ.2 లక్షలు ఆదా అవుతాయి.

2. ఆరోగ్య బీమా

సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా ప్రీమియంను క్లెయిం చేసుకోవచ్చు. ఎంత? అన్నది పాలసీ కవరేజీ, వయసుపై ఆధారపడి ఉంటుంది. ఇలా రూ.25,000, రూ.50,000, లక్ష రూపాయల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు.

3. విద్యా రుణం

పిల్లల విద్య కోసం రుణం తీసుకున్నట్టయితే.. దాని చెల్లింపులపైనా పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. సెక్షన్ 80ఈ కింద విద్యా రుణంలోని వడ్డీ భాగంపై పన్ను మినహాయింపును పరిమితి అనేదే లేకుండా పొందవచ్చు. రుణాన్ని చెల్లించేది తల్లిదండ్రులా.. పిల్లలా.. అన్న తేడా లేకుండా ఈ ప్రయోజనాన్ని అందుకోవచ్చు.

4. హోమ్ లోన్ వడ్డీ

గృహ రుణ చెల్లింపులపై రెండు మార్గాల్లో పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. ఒకటి సెక్షన్ 80సీ కింద అసలుపై రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు. మరొకటి సెక్షన్ 24 కింద వడ్డీ భాగంపై రూ.2 లక్షలదాకా పన్ను ఆదా కోరవచ్చు. కొన్న ఇంట్లో మీరున్నా.. లేదా దానిపై అద్దె ఆదాయం పొందుతున్నా.. పన్ను మినహాయింపులను అందుకోవచ్చు.

5. తొలిసారి ఇంటి కొనుగోలుపై

తొలిసారి ఇంటిని కొనుగోలుచేసేవారికి సెక్షన్ 80ఈఈ కింద గృహ రుణ వడ్డీపై కేంద్ర ప్రభుత్వం అదనపు పన్ను ప్రయోజనాలను కల్పిస్తున్నది. ఈ సెక్షన్‌లో రూ.50,000 వరకు ఎక్స్‌ట్రా ట్యాక్స్ క్లెయిములు చేయవచ్చు. సెక్షన్ 24 కింద వర్తించే మినహాయింపులకు అదనం. దీంతో రూ.2.5 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది. అయితే మీ పేరిట అంతకుముందు ఏ ఇల్లూ ఉండరాదు. అలాగే కొనే ఇంటి విలువ రూ.50 లక్షలు మించరాదు. తీసుకునే అప్పు కూడా రూ.35 లక్షలు దాటరాదు.

6. హెచ్ఆర్ఏ

ఉద్యోగులకు వారి సంస్థ యాజమాన్యాలు హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ)ను ఇస్తే.. అద్దెపై పన్ను మినహాయింపును పొందవచ్చు. సెక్షన్ 80జీజీ కింద ఈ అవకాశం ఉంటుంది.

7. ఎస్‌బీ అకౌంట్ వడ్డీ

సేవింగ్స్ బ్యాంక్ (ఎస్‌బీ) అకౌంట్ నుంచి అందుకునే వడ్డీ ఆదాయంపైనా పన్ను మినహాయింపును కోరవచ్చు. వడ్డీ ఆదాయం రూ.10,000 వరకుంటే సెక్షన్ 80టీటీఏ కింద ఎవరైనా వ్యక్తి లేదా హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) ఐటీ ప్రయోజనాన్ని పొందవచ్చు.

8. దివ్యాంగుల కేర్ టేకర్‌గా..

మీరు దివ్యాంగుల బాగోగులు చూసుకుంటున్నట్టైతే సెక్షన్ 80డీడీ కింద వారి ఖర్చులపై పన్ను మినహాయింపులను కోరవచ్చు. అంగ వైకల్యాన్నిబట్టి మినహాయింపు ఎంత? అన్నది తెలుస్తుంది. రూ.75,000-రూ.1.25 లక్షల మేర ఉంటుంది.

9. వైద్య ఖర్చులకు..

క్యాన్సర్, నరాల వ్యాధులు, ఎయిడ్స్ వంటి రోగాల వైద్య ఖర్చులపైనా ఐటీ మినహాయింపును తీసుకోవచ్చు. సెక్షన్ 80డీడీబీ కింద రూ.40,000 వరకు పన్ను తగ్గింపును పొందవచ్చు. సీనియర్ సిటిజన్లకైతే లక్ష రూపాయలదాకా ప్రయోజనం ఉంటుంది.

10. విరాళాలు

విరాళాలపై సెక్షన్ 80జీ కింద పన్ను మినహాయింపును క్లెయిం చేయవచ్చు. అయితే మొత్తం డొనేషన్‌పై ప్రయోజనం రాదు. అలాగే గుర్తింపు పొందిన ఛారిటబుల్ సంస్థకు విరాళం ఇస్తేనే ఈ సౌకర్యం ఉంటుంది.

పన్ను వర్తించే శ్లాబులో మీ ఆదాయం ఉన్నట్టైతే.. ప్రతీ ఆర్థిక సంవత్సరం ఐటీఆర్‌ను తప్పక దాఖలు చేయాల్సిందే. అయితే ఆదాయ పన్ను పరిధిలో మనం లేముకదా.. అని చాలా మంది ఐటీఆర్‌ను లైట్ తీసుకుంటారు. కానీ ఐటీ పరిధిలోకి రాకున్నా.. ఏటా నిల్ ఐటీఆర్‌ను దాఖలు చేస్తే పలు ప్రయోజనాలున్నాయి. 60 ఏండ్లలోపున్నవారికి పాత పన్ను విధానంలోనైతే రూ.2.5 లక్షలు, కొత్త పన్ను విధానంలోనైతే రూ.3 లక్షలదాకా వార్షిక ఆదాయం ఉన్నా పన్నులు చెల్లించనక్కర్లేదు. ఇక నిల్ ఐటీఆర్‌ను దాఖలు చేస్తే వీసా దరఖాస్తుల కోసం ప్రధాన ఆదాయ ధ్రువీకరణగా ఉంటుంది. అలాగే రుణాలను తీసుకునేటప్పుడు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ట్యాక్స్ రిఫండ్స్‌కూ దోహదపడుతుంది.

నిల్ ఐటీఆర్‌తో లాభాలివి..